ఓం శ్రీసాయిరాం

# జీవుడే దేవుడు

దేహమే ఒక దేవాలయము, జీవుడే దేవుడు. ఆ దేవాలయములో అహంకారమనే అంధకారమును పోగొట్టుకొనేదానికి దీపములను వెలిగించవలయును. దేవాలయములో దీపము పెడితే ప్రయోజనము లేదు. ఈ లక్ష్మీనారాయణ దేవాలయములో చీకటిలేదు. ఇక్కడికి వచ్చేవారి హృదయములో చీకటి వున్నది. చీకటి మానవునికిగాని మాధవునికి కాదు. పరమాత్ముడే దేదీప్యమానముగా ప్రకాశిస్తున్నాడు. కోటిసూర్యల ప్రకాశమువలె ప్రజ్వలిస్తుండే దేవునికి విద్యుచ్ఛక్తి దీపాలు ఏమాత్రము వెలుతురిస్తాయి? ప్రశాంతినుంచి ప్రకాంతి, ప్రకాంతినుంచి పరంజ్యోతి, ఇట్లు మానవుడు తనలోపల వుండు అంధకారమును నాశనము చేయవలెను. వెలుతురులోపలనే ఆనందము! దీపములు వెలిగించిన తరువాత, ఆ వెలుతురుకు తగిన పవిత్రతను యివ్వండి. ఆ వెలుతురులో పవిత్ర కార్యక్రములనే ఆచరించండి.

ఇప్పుడు ఎక్కడ చూచినా అశాంతియే కనబడుతున్నాది. శాంతి, సంతోషము ఎవరికీ లేదు. భౌతిక అభివృద్ధియేమో చాలా జరిగినది. అయితే నీతి, నియమము, శీలము ఇవి అభివృద్ధి కాకపోయినవి. నడచెడువారికి కఱ్ఱవుంటే కొంచెము హాయి! అయితే, పాదములో శక్తిలేకపోయిన, కఱ్ఱ మాత్రము ఏమిచేస్తుంది. అట్లే ఆధ్యాత్మికచింతన, దైవచింతనలేక, వట్టి భౌతిక అనుకూలము అనే కఱ్ఱ మాత్రము పట్టుకొంటే నడవలేదు.

సనాతన సంస్కృతి నిలయమే ప్రతి ఒక్క దేవాలయముకూడ. పూర్వము ఏదైనా కొత్త ఊరు పోతే ఆ ఊరివాండ్లను అడిగేది, 'మీ ఊరిలో దేవాలయము వున్నదా?' అని, దేవాలయము లేని ఊరులో వుండకూడదని అభిప్రాయము. ఇప్పుడు అట్లకాదు, 'మీ ఊరిలో సినీమా వున్నదా?' అని అడుగుతున్నారు. ఈ లక్ష్మీనారాయణ దేవాలయము సరిచేయటము బుక్కపట్టణమువారి పవిత్ర కర్తవ్యము. ఈ దేవాలయమునకు విద్యుద్దీపములు వేయటానికి పిల్లలు ఎంత కృషి చేసినారనేది ఇప్పుడు రిపోర్టులో విన్నాము.

భగవచ్చింతనలో ఎంత శాంతి, సంతోషమున్నది. గ్రామమునకు దేవాలయము ఎంత ముఖ్యమైనది, అని యోచిస్తే ఎవరైనా ఒకరు పూర్తిచేయవచ్చు ఈ చిన్న కార్యమును. తరతరములనుండి పోషించుచూ వచ్చిన సాంప్రదాయములను, సంస్కారమును, ధర్మమును, కర్తవ్యములను విడువకూడదు. తర్కవాదము పనికిరాదు. ఏమీ తెలియని వారికే తర్కవాదము. భక్తి, శ్రద్ధలుంటే చాలు. పోయిన నెల 5వ దేదీనుండి 28వ తేదీ వరకు మేము ఉత్తర ప్రదేశములో వుంటిమి. ఎక్కడకు పోయినా, పుట్టపర్తి, బుక్కపట్నం అనే గ్రామములను ప్రస్తావించటము, పొగడటము చూస్తే చాలా ఆశ్చర్యమౌతుంది. వారు ఎంత దూరములో వుండిననూ ఆధ్యాత్మికములో చాలా దగ్గర. మీకు వెలుతురు మాత్రమే కనబడినది. వేడితగలటము లేదు. కాబట్టి, దగ్గర స్థలమైననూ దూరమున్నట్లే. వేడి, వెలుతురు రెండూ వారివారి సంస్కారముయొక్క ఫలితమేగానీ వేరుకాదు.

ధర్మానికి నిలబడే నీడ లేదని విచారిస్తున్నవారికి బదరీయాత్ర మంచి ధైర్యమునిచ్చెను. ఇన్ని లక్షలమంది కష్టనష్టాలను లెక్కచేయక కేవలము భక్తితో ఆ బదరీనారాయణుని దర్శనమునకు వెడతారంటే, ఎంత గొప్పవిషయము, యోచించండి. వారందరికీ శాంతిసంతోషాలు ఒక్క భగవచ్చింతనలో తప్ప మరెక్కడనూ లేదు.

ఇప్పుడు తెలివి ఎక్కువ, బుద్ధి తక్కువ. తెలివి పెద్ద పెనుభూతముగా పెరిగిపోయినది. దానికి తగినట్లు బుద్ధి పెరగలేదు. బుద్ధిని పెంచుకోవలయును. అప్పుడు శీలముకూడా మంచిదౌతుంది. వివేకస్వరూపుడౌతాడు. ముఖ్యముగా హేళనము, అసూయ, అహంకారము వీటిని మనస్సునుండి తొలగించవలయును.

మానవుడంటే మనస్సును స్వాధీనము చేసుకొన్నవాడు, తెలివి పెరిగినవాడని కాదు. దివ్యత్వము, పవిత్రత ఇవి మానవ హృదయములోనే వున్నవి. వాటికొరకు వేరెక్కడనూ వెతికే అవసరము లేదు. ఉదయమునకు, అస్తమయమునకు ఒక సూర్యుడే కదా! అట్లనే సుఖము, దుఃఖము, రెండింటికి ఒక మనస్సే కారణము. ఆ మనస్సును అరికట్టి దానికి తగిన శిక్షణ యిస్తే నిత్యానందమును అనుభవించవచ్చును.

తెల్లని బట్టకు మలినమైతే, నీటిలో తడిపి సబ్బువేసి ఉడుకపెట్టి రాయిమీద కొట్టి మంచినీటిలో పిండవలయును కదా. అట్లే నీతి, నిష్ఠ అనే జలముతో పరమాత్మ చింతన అనే సబ్బు వేసి జ్ఞానముతో ఉడకబెట్టి వైరాగ్యమనే రాయిపైన కొడితే మరి దాని సహజమైన తెల్లదనము కనిపిస్తుంది. నియమ, నిష్ఠలు చాలా అవసరము.

విద్యుచ్ఛక్తి అని అందరూ చెబుతారేకానీ అ శక్తియొక్క నిజస్వరూపమేమని ఎవరికీ తెలియదు. అట్లనే, ఆత్మ అంటే ఏమి, దాని శక్తినుంచి దివ్యప్రకాశమెట్లా ఉత్పత్తి అవుతుంది అనేది ఎవరు చెప్పగలరు? తెలిసికోలేను అని తెలుసుకొనేదే ఉత్తమైన తెలివి.

(బుక్కపట్టణములో శ్రీలక్ష్మీనారాయణ దేవాలయమునకు విద్యుద్దీపములను వెలిగించి, తరువాత భగవాన్ శ్రీసత్యసాయిబాబావారు అచ్చట సెలవిచ్చిన ఉపన్యాసమునుండి)